ఆమె సౌందర్యాన్ని ఆరాధించాడు; ఆమెఅభిప్రాయాన్ని గౌరవించలేకపోయాడు !

"నా అభిప్రాయానికి విలువనియ్యని వ్యక్తిని భాగస్వామిగా గౌరవించలేను" అన్నాడు ;

కాని మన దృక్పథానికి సరిపడని ఆచారాల ఆచరణ:దండుగ ! అన్న కనువిప్పు కల్గిందతనికి !

# మారని రాధ

ఆనాడు కళాశాల వార్షికోత్సవం. వాతావరణం చాల బాగా అలంకరించ బడింది. కొన్ని వేలమంది ప్రేక్షకులతో కిక్కిరిసి పోయింది. అదే కాలేజీలో చదివి ఎమ్.ఏ లో యూనివర్సిటీ ఫస్టుగానెగ్గి, ఫారిన్ వెళ్ళి పి. హెచ్. డి తో తిరిగి వచ్చిన ప్రభు కూడ హాజరయాడు.

అన్ని కార్యక్రమాలూ పూర్తయాక ఇంటరు స్టూడెంటు రాధ వీణవాయించింది- ఆ మధురగానం వింటూ అందరూ తన్మయులయారు. అతిసుందరమైన ఆమెరూపానికి ప్రభు ముగ్ధుడయాడు. ఆమెను తనకు పరిచయం చేయవలసిందిగా లెక్చరర్ అయిన ఒక స్నేహితుడిని కోరాడు.

**కథానిక**

"ఇతను డాక్టరు ప్రభు" అని రాధకు-

"ఈమె రాధ. యింటరు చదువు తూంది. చాల తెలివైంది !" అంటూ ఒకరికొకరిని పరిచయంచేశాడు.

రాధ ఆశ్చర్యంతో చిన్నగా నవ్వుతూ 'నమస్తే' అని చేతులు కలిపింది. ప్రభు తన్మయత్వంతో ప్రతి నమస్కారం చేశాడు.

♦ ♦ ♦

ప్రభు రాధను ఫ్రెండు యింట్లో రెండుసార్లు కలిసాడు. పరిచయం వృద్ధి అయింది. రాధకు తల్లీ ఒక తమ్ముడు ఉన్నారని తెలుసుకున్నాడు.

రాధ సౌందర్యానికి ముగ్ధుడైన ప్రభు ఆమెనే వివాహం చేసుకోవాలని నిశ్చయించు కున్నాడు. తండ్రి పెళ్ళి సంగతి యెత్తినప్పుడు తన అభిప్రాయం చెప్పాడు. ప్రభు యిష్టానికే ప్రాముఖ్యత నిచ్చిన తండ్రి రాధనుచూసి రాయబారాలు జరిపాడు. రాధ అదృష్టానికి తల్లి యెంతో మురిసిపోయింది.

శుభముహూర్తంలో రాధ ప్రభుల వివాహం అతివైభవంగా జరిగిపోయింది.

కొద్దిరోజులకే ప్రభు తండ్రి అకస్మాత్తుగా మరణించాడు.

ప్రభు మద్రాసులోని ఒక ఇంగ్లీషు ఫర్మ్‌లో మేనేజరు. రాధనుకూడ తీసుకొని వెళ్ళిపోయాడు.

ప్రభుకి పాశ్చాత్య సాంప్రదాయాలంటే యెంతోయిష్టం. స్వదేశపు టాచారాలూ, సాంప్రదాయాలూ, అర్ధవిహీనమైన అతనికి మూఢనమ్మకం. రాధకూడ తన పంథానే అనుసరించాలని అతని కోరిక.

రాధకు భర్తంటే యెంతోప్రేమ, గౌరవం ఉన్నాయి. తనే స్వయంగా, అందంగా అన్ని పనులూ చేసుకుంటూంటే భర్త వారించి నౌకర్లను పెట్టడం కష్ట మనిపించింది.

ప్రభు పరాయిస్త్రీలతో చాల ఫ్రీగా మెలిగేవాడు. రాధకూడ అదే విధంగా అందరితో కలియాలని అతను కోరేవాడు. కాని రాధ మటుకు మనస్ఫూర్తిగా యిష్టపడలేక పోయింది. ఎప్పుడూ పార్టీలూ,

కుమారి డి. వాణి.

స్నేహితులూ, షికార్లతో హడావిడిగా ఉండే జీవితం కంటె ప్రశాంతంగా వీణవాయించుకుంటూ, చదువు కుంటూ. ఇంటిపట్టున ఉండటమే ఉత్తమమని రాధ అభిప్రాయం. కాని ప్రభుకి అదినచ్చలేదు. ఆమె సౌం దర్యాన్ని ఆరాధించిన ప్రభు ఆమె అభిప్రాయాల్ని గౌరవించలేక పోయాడు. ఆమె సంగీతాన్ని ఆరా ధించలేక పోయాడు.

నాకు కర్నాటక సంగీతం అంటే యిష్టంలేదు రాధా ! నీవు పియానో నేర్చుకొని ఇంగ్లీషు పాటలు వాయించాలి; ఇంకా మూఢాచారాల్ని పట్టుకొని ప్రేళ్ళాడటం నాకిష్టంలేదు, అన్నాడు. ఒకరోజున.

భర్తను కొంచెంగా అర్థంచేసు కొంటున్న రాధ కృంగిపోయింది. స్వదేశీయ సాంప్రదాయాలు అర్థ విహీనమైన వేనా? సంగీతానికి విలువలేదా? తన భావాల్ని గౌరవించి, తన సంగీతారాధనకు చేయూత నిచ్చే విశాలహృదయుడని మురిసి పోవడం భ్రమేనా? రాధయేమీ మాట్లాడలేక మౌనంగా వెళ్ళిపోయింది.

"నీవు జవాబు చెప్పనేలేదేం రాధా?" అని అడి గాడు మరునాడు.

"క్షమించండి, నాకామ్యూజిక్‌లో అభిరుచిలేదు!" అన్నది శాంతంగా. ప్రభు అహం దెబ్బతిన్నది.

"నా మాట ప్రకారం నడుచుకోవన్న మాట" అధికారంతో ఉరిమాడు. రాధ భయపడింది. "మిమ్మల్ని ఎదిరించడం నా ఉద్దేశంకాదు" మెల్లగా అని వెళ్ళిపోయింది.

కొన్ని రోజులు గడిచాయి. ప్రభు అహం రాధతో మాట్లాడనీయ లేదు. ఆమె చాల బాధ పడసాగింది.

ఆనాడు కార్తీక పౌర్ణమి. ప్రభు వెన్నెట్లో డాబా మీద పచారుచేస్తున్నాడు. రాధ గదిలో వీణ వాయి స్తూంది. సంగీతం వింటూ ప్రభు కొంచెం సేపు తనను మర్చిపోయాడు. కాని మరల కోపం తలెత్తింది. ఇంతలో రాధ యువతలకు వచ్చింది. భర్తకు నచ్చ జెప్పాలని. ప్రసన్నునిగా చేసుకోవాలని యెంతో ఆశతో అతనివైపు చూచింది.

"ప్రభూ !" ఆమె స్వరం అతి మృదువుగా మధు రంగా ఉంది.

"మన సంగీతానికి, సంస్కృతికి ప్రపంచంలో యెంతో ప్రాముఖ్యం, గౌరవం ఉన్నాయి. అంత ఉన్నతమైన వాటిని ఆరాధించి ధన్యులవడం ఉత్తమం కాని పరాయి సాంప్రదాయాలే మంచివని భావిస్తూ ఉండటం మనను మనమే కించపరచు కోవడం అవు తుంది!" రాధ మాటలు వింటూ ప్రభు కొంత సేపు మౌనంగా ఉండిపోయాడు. తనలో రేగే సంఘర్షణ నణచుకుంటూ ముఖం చిట్లించుకొని వెళ్ళిపోయాడు.

మరునాడు సాయంత్రం ప్రభు యింటికి వచ్చేసరికి రాధ రేడియో సంగీతం వింటూంది.

"ఆపు రాధా ! ఆపాట," చికాకుగా అరిచాడు. రాధ రేడియో కట్టేసింది.

"నేనంటే నీకు లక్ష్యంలేనప్పుడు నీవిక్కడ ఉండటం అనవసరం," మూర్ఖంగా అన్నాడు. రాధ నిర్ఘాం తపోయింది. కళ్ళు నీళ్ళతో నిండాయి.

"మీరే నా సర్వస్వం. మీరేం చెప్పినా చేస్తాను. కాని—! కాని నాసంగీతాన్ని మట్టుకు మానుకోలేను" అన్నది గద్గద స్వరంతో.

"నా అభిప్రాయానికి విలువనీయని వ్యక్తిని నా భాగస్వామినిగా గౌరవించలేను" అంటూ విసురుగా వెళ్ళిపోయాడు. రాధ ఆవేదనతో యేడుస్తూ కూర్చుండి పోయింది.

ప్రభు మౌనంగానే రాధ ప్రయణానికి యేర్పాట్లు చేయించాడు. ఆమె యెంతో బ్రతిమాలింది. ఎంతో బాధపడింది. కాని ప్రభూ యేమీ చలించలేదు.

రాధ వెళ్తూంటే ప్రభు బాల్కనీలోంచి చూడ కుండా ఉండలేక పోయాడు. ఆమెను వెనక్కు తీసుకు రావాలని, ఆమె ఉత్తమాదర్శాలను గౌరవించి, సుఖ పెట్టడం తనవిధి అని అంతరాత్మ ఘోషించింది. కాని ద్వేషం అతన్ని వెనక్కు లాగింది.

ప్రభుకి యిల్లంతా చిన్నబోయిన నట్లయింది. ఆమె మధుర స్వరం, వీణాగానం అతన్ని వెన్నాడసాగాయి. ఏదో బాధతోనే రెండు నెలలు గడిపాడు.

ప్రభుకి కలకత్తా బదిలీ అయింది. అక్కడ రామ ప్రసాద్ అతని సహోద్యోగి. అతని కూతురు విమల బి. ఎ. చదువుతూంది. ఆమె రాధవంటి సహజ సౌందర్యవతి కాకపోయినా నాజూకుగానే ఉంటుంది. ఆమె ప్రభు అభిప్రాయాలతో పూర్తిగా యేకిభవించే వ్యక్తి. అందుచేత యిద్దరూ త్వరలోనే గాఢ స్నేహితు లైనారు. ప్రభు తన గత చరిత్ర విమలకు తెలియ

నివ్వలేదు. ఇద్దరూ యింగ్లీషు మ్యూజిక్ వింటూ, ఇంగ్లీషు ఫిలిమ్స్ మాత్రమే చూస్తూ చాలా ఫ్రీగా పార్టీలకూ, షికార్లకు వెళ్లేవారు. ప్రభు స్నేహం విమలలో ఆశ రేకెత్తించింది. ప్రభు విమలను పెళ్ళి చేసుకుందామని అనుకున్నాడు. ఆమెని అడగాలని ఎన్నో సార్లు ప్రయత్నించాడు. రాధ దీనస్వరూపం అతని కళ్ళముందు మెదిలేది. నమ్రతతో కూడిన ఆమె ప్రవర్తన గుర్తుకొచ్చేది. ఇంకేమీ మాట్లాలేకపోయేవాడు. ఆవిధంగా సంవత్సరం గడిచిపోయింది.

రాధ ప్రభుకు ఎన్నో ఉత్తరాలు రాసింది. కాని ఒక్కదానికికూడ ఆమె జవాబు అందుకోలేదు. తనకిక సుఖం శూన్యమని నిరాశ చెందింది. మనోవ్యాధితో శుష్కించిపోయింది.

విమల పరీక్షలు పూర్తయాయి. ఆమె తల్లి ఊరికి వెళ్ళాలని పట్టు పట్టింది. విమలకు, ప్రభుకు ఏమాత్రం యిష్టం లేకపోయినా వెళ్ళక తప్పలేదు.

విమల వెళ్ళాక ప్రభుకేమీ తోచలేదు. కాని రెండు నెలలకుగాని రాదనుకున్న విమల పదిరోజులకే తిరిగి రావటం ఆశ్చర్యం, ఆనందం కలిగించాయి. ఆ సాయంత్రమే పిక్చర్ ప్రోగ్రాం వేసి విమల యింటికి వెళ్ళాడు. కాని ఆమె యిదివరకటిలాగ ఉల్లాసంగా మాట్లాడలేదు.

'మంచి పిక్చర్ వచ్చింది వెళ్దాం విమలా',

'నేను రాను ప్రభూ! ఈవేళ ఒక ప్రఖ్యాత గాయని కర్ణాటక సంగీత కచ్చేరి ఉంది. వెళ్ళాలి', ముక్తసరిగా అన్నది. ప్రభు తెల్లబోయాడు.

'విమలా ! ఏమిటిమార్పు?' ఆశ్చర్యంతో అడిగాడు.

"జ్ఞానోదయమైంది ప్రభూ !" విమల కళ్లు నీళ్ళతో నిండాయి. ముఖం త్రిప్పుకుంది. ప్రభుకి పరిస్థితి అయోమయంగా ఉన్నా ఆమెను అనుసరించాడు.

సగంలోనే తలనొప్పిగా ఉందని లేచి వెళ్లిపోతున్న ప్రభును చూస్తూ విమల బాధగా నవ్వుకుంది.

పని ఒత్తిడివల్ల ప్రభు విమలను వారంరోజులవరకు కలుసుకోలేకపోయాడు. ఆదివారం సాయంత్రం వెళ్ళాడు. గుమ్మంలో అడుగు పెట్టగానే విమల పలకరింపులతో కల కలలాడే యిల్లు నిశ్శబ్దంగా ఉంది. విమల మేడమీద వున్నదని నౌఖరు చెప్పాడు.

విమల కిటికీదగ్గర కూర్చుంది. ఆమె కళ్ళవెంట నీళ్ళు కారుతున్నాయి.

'విమలా ! ఒంట్లో బాగులేదా?' ప్రభు ప్రశ్న విని ఆమె త్రుళ్లిపడింది.

'అన్నయ్యా !' విమల గద్గదస్వరం సంబోధన ప్రభును కలవరపరిచాయి. నిరుత్తరుడై నిల్చుండిపోయాడు.

'పాశ్చత్య సాంప్రదాయాలు, అలవాట్లు మంచివే. కాని వాటినే మనమూ అనుకరించాలని, అవే గొప్పవని అనుకోవడంలో సుఖంలేదు. అవి మన దృక్పథాలకు సరిపడవు. ప్రపంచంలో ప్రత్యేకంగా గౌరవించబడే మన దేశాచారాల ప్రకారం నడుచుకోవడం ఆనందదాయకం,' అని ప్రభువైపు చూచింది. విమల మాటలు ప్రభులో ఆవేదనను రేపాయి. నిజమంతేనని, రాధని తిరస్కరించడం తప్పని తోచసాగింది.

'రాధ, నేను చిన్నప్పుడు కలసి చదువుకున్నాము. ఆమె తండ్రి పోయిన తరువాత వారు ఎక్కడికో వెళ్ళిపోయారు. ఇన్నేళ్లకు మేమిద్దరం అనుకోకుండా కలిశాం. ఉత్తమగుణ సంపన్న, సంగీతంలో మేటి అయిన రాధను కోరి వివాహం చేసుకొని, మొదటినించి నీలో పాతుకుపోయిన అభిప్రాయాలవలన న్యాయమాలోచించక వదిలిపెట్టావని తెలిసింది. ఆమె అనుదినమూ నీరాకకోసం యెదురుచూస్తూ నిరాశతో, మనోవ్యాధితో క్రుంగిపోతూంది. ఆమెకు నీ లక్ష్యంలేదని అపోహపడ్డావు కాని ఆమె నిష్కల్మష ప్రేమైక హృదయాన్ని అర్థం చేసుకోవడానికి ప్రయత్నించలేదు. దివ్యమూర్తి అయిన రాధను బాధించడం నీకు తగదు అన్నయ్యా !' విమల కంఠం రుద్ధమైంది. ప్రభులో కలిగిన బాధకు అందులేదు.

'నీమాటలు నిజం విమలా ! నేను రాధకు అన్యాయం చేశాను.' బరువుగా అడుగులు వేసుకుంటూ వెళ్ళిపోయాడు. విమల తృప్తిగా నవ్వుకుంది.

* * *

వీణ వాయించుకుంటున్న రాధ అడుగుల సవ్వడి విని తలెత్తింది. తన కళ్ళను తానే నమ్మలేకపోయింది.

'నిన్ను అర్థం చేసుకోకుండా చాలా బాధ పెట్టాను. నన్ను మన్నించు రాధా !' రుద్ధ కంఠంతో అన్నాడు ప్రభు.

ఆయింట్లో తిరిగి ఆనందం, సౌఖ్యం వెల్లివిరిశాయి.